# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 04-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ట్రినిడాడ్ టొబాగోలోని భారత సంతతి పౌరులు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (OCI) కార్డులకు అర్హులని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- భారత్... సార్వభౌమాధికార రక్షణ పట్ల ప్రభుత్వ నిబద్ధతకు ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణ అని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు.
- దేశంలో అన్ని మతాల ప్రజలు సమాన హక్కులతో జీవిస్తున్నారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు.
- అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో దేశంలో ఖనిజాల ఉత్పత్తి జరుగుతోందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు.

==============================

ట్రినిటాడ్ టొబాగోలోని భారతీయ సమాజం రామాయణాన్ని వారి హృదయాల్లో నింపుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగించారు. భారతదేశం నుండి చాలా మంది ప్రజలు సంవత్సరాల క్రితం ట్రినిడాడ్ టొబాగోకు వెళ్ళి స్థిరపడ్డారని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా, వారు వివిధ రంగాలలో తమ ప్రత్యేకతను చాటుకుంటూ.. దేశ అభివృద్ధి ప్రయాణాన్ని సుసంపన్నం చేస్తున్నారన్నారు. ట్రినిడాడ్ టొబాగోలోని భారత సంతతి పౌరులు ఇప్పుడు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (OCI) కార్డులకు అర్హులని, దీని ద్వారా వారు ఎటువంటి పరిమితులు లేకుండా భారతదేశంలో నివసించడానికి, పని చేయడానికి వీలు కలుగుతుందని తెలిపారు.

(వాయిస్ 30 సెకన్లు)

==============================

దేశ సార్వభౌమాధికార రక్షణ పట్ల ప్రభుత్వం, సాయుధ దళాల నిబద్ధతకు ఆపరేషన్ సిందూర్ అద్భుత ఉదాహరణ అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. పుణెలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (NDA) ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, పీష్వా బాజీరావ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య సంగ్రామం శివాజీ మహారాజ్ నుంచే మొదలయ్యిందని, పీష్వాలు దానిని మరో 100 సంవత్సరాల ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. బాజీరావు తన 40 ఏళ్ల జీవితంలో ఎవరికి సాధ్యం కాని రీతిలో చరిత్ర సృష్టించారన్నారు. పర్యటనలో కేంద్ర మంత్రి పుణేలో జైరాజ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్‌ను ప్రారంభించారు.

==============================

“ఆపరేషన్ సిందూర్” ద్వారా పాకిస్థాన్‌తో పాటు ప్రపంచానికి భారత్ బలాన్ని చూపించామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో క్షత్రియ సేవా సమితి.. భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. హనుమాన్ స్ఫూర్తిగా ‘ఆపరేషన్ సిందూర్’ కొనసాగిందని తెలిపారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా దాడులు చేశామని స్పష్టం చేశారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో పోరాడారని గుర్తు చేశారు. అల్లూరి పుట్టిన ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==============================

భారతీయ తపాల శాఖ దేశవ్యాప్తంగా 1.64 లక్షలకు పైగా సేవా కేంద్రాలతో దేశంలోనే అతిపెద్ద లాజిస్టిక్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోందని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. భారతీయ పోస్ట్.. సాంప్రదాయ మెయిల్ డెలివరీని మించి అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. సంస్థలో మొదటిసారిగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌ను నియమించడం జరిగిందని, పోస్ట్ మెన్‌లకు ఆధునిక పరికరాలు అందజేశామని చెప్పారు. ప్రతి లావాదేవీని రియల్-టైమ్‌లో డిజిటల్ ట్రాకింగ్ చేసే వెసులుబాటు కలిగిందని పేర్కొన్నారు. దేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాలలో కూడా కొరియర్‌లను అందజేసే విధంగా జియో-కోడెడ్ అడ్రస్ సిస్టమ్.. డిజిపిన్ ను త్వరలో ప్రారంభించనున్నామని వివరించారు.

విరామం

==============================

“ఆపరేషన్ సిందూర్” సమయంలో పాకిస్థాన్‌లో 21 లక్ష్యాలను గుర్తించి, వాటిలో 9 కేంద్రాలపై దాడులు చేయాలని చివరి నిమిషంలో నిర్ణయించామని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్.. లెఫ్టినెంట్ జనరల్ రాహుల్ ఆర్ సింగ్ తెలిపారు. పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలు, ఆపరేషన్ సిందూర్ సమయంలో నెలకొన్న పరిణామాలపై ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌కు చెందిన 81 శాతం మిలిటరీ హార్డ్‌వేర్ చైనావే అని, చైనా తన సైనిక సామర్థ్యాల పరీక్షల కోసం పాకిస్థాన్‌ను ప్రయోగశాలగా వాడుకుంటోందని ఆరోపించారు. కీలక సమయంలో భారత్ వ్యూహాలను చైనా ఎప్పటికప్పుడు పాకిస్తాన్‌కు చేరవేసిందని డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ స్పష్టం చేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

==============================

భారత్‌లో మైనార్టీలు పొందుతున్న వసతులు ప్రపంచంలో ఏ దేశ ప్రజలూ పొందడం లేదని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఈరోజు ఆయన హజ్ యాత్రపై సమీక్ష నిర్వహించారు. అనంతరం

మాట్లాడుతూ.. మైనార్టీల్లో చాలా మంది ఇప్పటికీ పేదవారిగానే ఉండిపోవడానికి ప్రతిపక్ష పార్టీయే కారణమని ఆరోపిస్తూ.. ఇప్పటికైనా ఆ పార్టీ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. బీహార్ ఎన్నికలపై స్పందించిన ఆయన... తాము లౌకికవాదులమని, కులం, మతం ఆధారంగా రాజకీయాలు చేయమని స్పష్టం చేశారు. భారత్‌లో అన్ని మతాల ప్రజలు సురక్షితంగా, సమాన హక్కులతో జీవిస్తున్నారని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు.

===============================

ఖనిజాల ఉత్పత్తిలో కోల్ ఇండియా కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. కోల్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 500 మినరల్ బ్లాక్స్‌లో లీజ్ నవీకరణ ప్రక్రియను సులభతరం చేశామన్నారు. గనుల లీజ్ రెన్యువల్‌కు సింగిల్ విండో విధానాన్ని అమలులోకి తీసుకువచ్చామని చెప్పారు. కోల్ ఇండియా ఆత్మనిర్భర్ భారత్ కు అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. స్థానికుల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు. అత్యాధునిక సాంకేతికతను వినియోగించి ఖనిజాల ఉత్పత్తి జరుగుతోందని, అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో కూడా కోల్ ఇండియా అడుగుపెట్టిందని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

===============================

భారీ వర్షాలు, వరదల కారణంగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటివరకు 63 మంది మరణించారని ఆ రాష్ట్ర అధికార వర్గాలు తెలిపాయి. మరోపక్క ఈ నెల 7వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లోను భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) సూచించింది. వరదల కారణంగా ఇప్పటివరకు సుమారు 400 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ అధికారులు తెలిపారు.

కాగా భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన పలు రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులకు ఈరోజు లేఖ రాశారు.

===============================

కశ్మీర్‌లో నిన్న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్ర సజావుగా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. దక్షిణ కాశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలోని పహల్గామ్, మధ్య కాశ్మీర్ గండేర్‌బాల్ జిల్లాలోని బాల్తాల్ జంట మార్గాల నుండి ఈ 38 రోజుల వార్షిక యాత్ర ఎటువంటి ఆటంకాలు లేకుండా జరుగుతుందని పేర్కొన్నారు.

===============================
===============================